క్లుప్తంగా

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని ఐదు బోర్లు అడుగంటిపోవడంతో ఎస్సీ, బీసీ కాలనీల్లోని ట్యాంకులకు నాలుగు రోజుల నుంచి తాగు నీరు సరఫరా కావడం లేదు. సమస్యను తెలుసుకుని ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నూరుల్లా తెలిపారు.

దామగట్లలో బోరు ఏర్పాటు



బోరును పరిశీలిస్తున్న గ్రామ నాయకులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని దామగట్ల గ్రామంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో బోరును ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి సహకారంతో కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి బోరును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ఏసురత్నం పాల్గొన్నారు.

దుండగుల దుశ్చర్య

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తవ్విన బోరులో గుర్తుతెలియని దుండగులు రాళ్లువేసి పూడ్చారు. దూ.లక్ష ఎమ్మెల్యే నిధులతో నెలరోజుల క్రితం పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేదారిలో 600 అడుగుల మేర బోరును తవ్వించగా రెండు ఇంచుల మేర నీళ్లు పడ్డాయి. శుక్రవారం బోరుకు మోటారును అమర్చేందుకు సర్పంచ్ మాధవరం ప్రకాశం వెళ్లగా బోరులో రాళ్లు ఉండటం గమనించారు. బోరు బండిని రప్పించి రాళ్లు తొలగించాల్సి ఉంటుందని మెకానిక్ వెల్లడించినట్లు సర్పంచ్ తెలిపారు. బోరులో రాళ్లు వేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

19న శ్రీ బరక సంజీవరాయ స్వామి వార్షికోత్సవం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి వార్షికోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా 19, 20 తేదీలలో వివిధ కేటగిరిలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ ఔదార్యం



అనాథకు దుప్పటి అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అరుణ

పాములపాడు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అరుణ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణారావుపేట గ్రామంలో రోడ్డుపై ఉన్న అనాథలకు దుప్పట్లు అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఏటా చలికాలంలో అనాథలకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు డీటీ అరుణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పల్లకోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాకారంలో పల్లకీసేవ ఉత్సవం మహానందంగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకీసేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో మహానందీశ్వరస్వామిని పూజించారు.

పరామర్శ

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కోనేటమ్మ పల్లె గ్రామానికి చెందిన బోరెల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అక్కడికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో రథశాల వద్ద విశేషపూజలు నిర్వహించారు. అందులో భాగంగా గణపతిపూజ, సూర్య యంత్రస్థాపనం, త్రిశూల చండీశ్వరార్చన, సూర్యనమస్కారాలు, ఆదిత్య యంత్రారాధన పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. రథానికి అధిదేవతలైన బ్రహ్మాదిదేవతలను ఆవాహన చేసి రథాన్ని రథమండపం నుంచి రథాన్ని బయటికి లాగారు. వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ ప్రత్యక్షదైవమైన సూర్యభగవానుడి ఆరాధనతో సంపూర్ణ ఆయురారోగ్యాలు చేకూరుతాయని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్నపల్లె సూర్యదేవాలయంలో..

బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని సంజ్ఞాదేవి సమేత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. సూర్యారాధన, ఆదిత్య హృదయం పఠనం, హోమం శాస్త్రోక్తం చేపట్టారు. స్వామి వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాల మాలలతో వైభవంగా అలకరించారు.



పార్నపల్లెలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



మహానందిలో రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకున్న స్వామివారు



స్వామి సన్నిధిలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని, డాక్టర్ దార సుధీర్



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం కమనీయం

నందికొట్కూరు: స్థానిక ఛాయ ఉషా సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణ కమనీయంగా సాగింది. స్వామి వారి కల్యాణ మహోత్సవం అర్చకులు చిత్తూరు సురేష్‌కుమార్ శర్మ, నాగభూషణం శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా స్వామి, అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఉపేంద్రారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జబ్బార్, మహేశ్వరరెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతిదేవి ఆలయంలో..

కొత్తపల్లి: సరస్వతి క్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయపు రోహితులు అమ్మవారిని వేకుజామునే ప్రత్యేక అలంకరణ చేసి, అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేషపూజలు చేశారు. రథసప్తమి మంచి రోజు కావడంతో సుదూర ప్రాంతాలనుంచి భక్తులు వారి చిన్నారులకు మంచి విద్యా,బుద్ధులు ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేసుకొన్నారు. అదే విధంగా చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు



చిన్నారులకు అక్షరభ్యాసం చేస్తున్న దృశ్యం

మల్లన్న సన్నిధిలో డిప్యూటీ సీఎం దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శుక్రవారం డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. మంత్రి కొట్టు దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయం వద్ద ఉన్న ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నందికొట్కూర్ నియోజకవర్గ సమన్వయకర్త డక్టర్ దార సుధీర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 18వ వార్డులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీకి బలమన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలను కోరాలన్నారు. పేదల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుండగా ప్రతి సారి చంద్రబాబు కోర్టులను ఆశ్రయించి అడ్డు తగిలిన అంశాలను గుర్తు చేయాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన అందిస్తున్న పార్టీ ఏదో బేరీజు వేసుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలకు సూచించాలన్నారు. అనంతరం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కౌన్సిలర్లు రవూఫ్, దాండ్‌బాషా, లాలు, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గఫార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, విద్యార్థి సంఘం నాయకురాలు మాధురి, జిల్లా నాయకులు ఉస్మాన్ బేగ్, సులోచన, స్థానిక నాయకులు జబ్బార్, శ్రీకాంత్, కుర్వ శ్రీను, రామకృష్ణ, ఆర్ట్ శ్రీను, సుధాకర్ రెడ్డి, రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



సిద్ధం వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్ దార సుధీర్

మల్లన్న సేవలో ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రాజగోపురం వద్ద ఆయనకు ఆలయ అధికారులు, అర్చకస్వాములు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ఉన్నారు.

- స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు టీఎండీ రఫీ ఏర్పాటు చేసిన సహస్ర హోటల్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. అలాగే శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయ ప్రధానార్చకులు వీరయ్య స్వామి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.



శ్రీశైల ఆలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

సిద్ధం సభను విజయవంతం చేద్దాం



శిల్పా కార్తీక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైస్ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ

మహానంది: అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత శిల్పా కార్తీక్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ స్వగృహంలో ముఖ్యకార్యకర్తలతో మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలకు అనూహ్య స్పందన వస్తుందన్నారు. సభలకు వచ్చే జనాలను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, మండల నాయకులు వీరారెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

పాములపాడు: నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ప్రజలకు విద్యుత్ సమస్యకు చెక్ పడిందని సర్పంచు వరప్రసాద్ అన్నారు. శుక్రవారం కృష్ణారావుపేట గ్రామంలో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య తలెత్తినా వెంటనే తగు చర్యలు తీసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధానంగా జెడ్పీటీసీ జ్యోతిరామలింగేశ్వరరెడ్డి ప్రతి సమస్యపై స్పందిస్తున్నారన్నారు. వారి సహకారం మేరకు గ్రామంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, లైన్‌మెన్ బాషా పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సర్పంచు, ప్రజలు

ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సుల ద్వారా ఉపాధి

నందికొట్కూరు: పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం అంతర్జాతీయ వర్సిటీలు అందించే కోర్సులను ఉచితంగా చదివేందుకు వీలు కల్పిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని బసిరెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం – ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్‌ల మధ్య ఒప్పందం కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాలలో విద్యార్థులు దానిల్సలో లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎలిషాబాబు, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, సరళాదేవి పాల్గొన్నారు.

లింగాలగట్టు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేశా

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేశానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీశైలంప్రాజెక్ట్‌లోని ఏపీజెన్‌కో అతిథి గృహంలో మత్స్యకారులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ లింగాలగట్టులో మూతపడిన సహకార సొసైటీని పునరుద్ధరించేందుకు కృషి చేశానన్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు చేపలు పట్టుకునేందుకు ఉపాధి దొరికిందన్నారు. వందలాది కుటుంబాలకు లైసెన్సులు, ఇన్సూరెన్స్ తదితర అవకాశాలు కల్పించామన్నారు. కొన్ని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందజేశామన్నారు. అలాగే ఇటీవల నదిలో విషపదార్థాలు కలవడంతో చేపలు మృతిచెందగా విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరినట్లు చెప్పారు. మాయమాటలు చెప్పే రాజకీయ నాయకులను నమ్మవద్దని, ప్రతి ఇంటికి మేలు చేసే జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, లింగాలగట్టు గ్రామ నాయకులు కొండబాబు, బెల్లూరి మల్లికార్జున, మీనిగ చెన్నయ్య, జగ్గారావు, సోమేశ్, కోదండం, విజయ్‌కుమార్ తదితరుల పాల్గొన్నారు.



లింగాలగట్టు వాసులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

లింగాలగట్టు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు 100 మంది శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సేవానిరతి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పలువురు తెలిపారు. పార్టీలో చేరిన వారికి శిల్పా చక్రపాణిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సోరాడ దేవుడు, సోరాడ సూకరాజు, సిరిపిల్లి సూకరాజు, కొంకోట తులసి, ఒసిపిల్లి సోమేశ్, చెల్లూరి ధనరాజ్, చింతకాయల జగ్గారావు, మైలపల్లి బంగారి తదితరులు ఉన్నారు. కాగా లింగాలగట్టు గ్రామానికే చెందిన టీడీపీ వీరవిధేయుడిగా ఉన్న క్రియాశీలక నాయకుడు కూడా త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు సమాచారం.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

పోస్టర్లు విడుదల

వగిద్యాల: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం విద్యాధికారి సుభాన్ మిషన్ జీఈఆర్ 100 శాతం సర్వే పోస్టర్లు విడుదల చేశారు. మండల వ్యాప్తంగా బడి ఈడు కలిగిన 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమని ఎంఈఓ పేర్కొన్నారు. బడి మధ్యలో ఆపేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని పాఠశాల, కళాశాలల్లో చేర్పించి వంద శాతం హాజరు సాధించడమే లక్ష్యమన్నారు.

మండ్లెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం-1 సచివాలయ పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎంపీడీఓ నూర్జహాన్, వైఎస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ప్రాథమిక వైద్యులు మౌనిక, యశ్విని పాల్గొన్నారు. డాక్టర్లు 500 మందికి ఏడు రకాల పరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. 20 మందికి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్‌ చేశారు. సర్పంచ్ కృపమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది,ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బుక్కాపురంలో..

మహానంది: మండల పరిధిలోని బుక్కాపురం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. వైద్యులు భగవాన్‌దాస్, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, బుక్కాపురం సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

సాక్షి నెట్‌వర్క్: ప్రజావ్యతిరేక విధానలను తిప్పికొడదామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. రైతుకార్మిక సంఘాలు పిలుపు మేరకు నందికొట్కూర్, శ్రీశైలం నియోజకవర్గాల వ్యాప్తంగా శుక్రవారం కార్మికులు ధర్నాలు నిర్వహించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణమాఫీ చేయాలని, కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇస్తూ, 200 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పరిశీలన

వగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల శుక్రవారం పరిశీలించారు. ట్యాంకులో 80 శాతం నీటి నిల్వ ఉన్నాయని, పొదుపుగా వినియోగించుకుంటే ఆగస్టు వరకు గ్రామాలకు సరఫరా అవుతాయన్నారు. ట్యాంకు చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని కాంట్రాక్టర్ నాగిరెడ్డిని ఆదేశించారు. లక్ష్మాపురం నుంచి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను ఆమె పరిశీలించారు. డీఈ వెంట ఏఈ శివకుమార్ ఉన్నారు.

సంక్షిప్తం

నేడు వలంటీర్లకు వందనం

ఆత్మకూరు: పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర, మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు.

పాఠశాలను తనిఖీ

వగిద్యాల: మండలంలోని కొత్తముచ్చుమర్రి, కొత్త ఎల్లాల ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ సుభాన్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంల మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాములపాడు: జగనన్న గోరుముద్ద కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని స్కీం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. శుక్రవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రతి ఇంటికి కుళాయి కుళాయి

మహానంది/మిడుతూరు: ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటిని అందించడమే ప్రభుత్వం లక్ష్యమని జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ భీమశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బండిఆత్మకూరు, మిడుతూరు మండల కేంద్రాల్లో జలజీవన్ మిషన్ పనుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలని

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆత్మకూరు సీఐ నాగభూషన్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రాజకీయ పార్టీల కోసం వర్గాలుగా విడిపోయి ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బోర్లకు మరమ్మతులు

ఆత్మకూరు: ప్రజల దాహం తీర్చేందుకు బోర్లకు మరమ్మతులు చేయించినట్లు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 15వ వార్డుల్లో చెడిపోయిన బోర్లను మెకానిక్‌లతో మరమ్మతులు చేయించారు.

సర్వేలను పూర్తిచేయండి

కొత్తపల్లి: పెండింగ్ సర్వేలు పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. శుక్రవారం దుద్యాల, నందికుంట గ్రామాల సచివాలయాలను సందర్శించి రికార్డులను తనిఖీచేసి, సిబ్బందికి సూచనలు చేశారు. హౌసింగ్ ఎన్‌పీఐ రిజిస్ట్రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఆరోగ్య శ్రీ యాప్ మొబైల్ డౌన్‌లోడింగ్, ఆయుష్మాన్, పీఎంజేఏవై కార్డుల పంపిణీ, కులగణన సర్వేలను వేగవంతం చేసి పూర్తిచేయాలని సూచించారు.

సెల్‌ఫోన్ల చోరీ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో శుక్రవారం మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. తాటిపాడు గ్రామానికి పోతులూరయ్య, జూపాడుబంగ్లాకు చెందిన హరీష్‌గౌడు, బాషాల వారాంతపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా పై జేబుల్లోని సెల్‌ఫోన్లను చాకచక్యంగా తస్కరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.